సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



మళ్లీ చెలరేగిన అల్లర్లు

కొవ్వూరు మళ్లీ రావణ కాష్టమైంది.. ఇరువ ర్గాల దాడులతో అట్టుడికింది.. గురువారం రాత్రి గణేశ విగ్రహ నిమజ్జనోత్సవంలో జరిగిన ఘర్షణ ఇరువర్గాల మధ్య దాడులకు ఉసిగొల్పింది..




కనకదుర్గమ్మకు బంగారు కిరీటం

గోకవరం దేవీచౌక్ ఆలయంలో కొలువైన శ్రీకనక దుర్గమ్మ వారికి రూ.21 లక్షలతో తయారు చేయించిన బంగారు కిరీటాన్ని దాత కం బాల శ్రీనివాసరావు, భక్తులు అందజేశారు.

8లో

1.62 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 1,62,276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

నాణేల సేకరణ పుస్తకం ఆవిష్కరణ



నాణేల సేకరణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, చిత్రంలో పుస్తక రచయితలు

అమలాపురం టౌన్: నాణేల సేకరణ కర్తలు పుత్తా కృష్ణకామేశ్వర్ (అమలాపురం), పర్వతిన వెంకట నారాయణ (సామర్లకోట మండలం వీకే రామపురం)లు రచించిన నాణేల సేకరణ పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. వీరు రచించిన నాణేల సేకరణ పుస్తకం విద్యార్థులకు విజ్ఞాన పరంగా, ఔత్సాహికులకు నాణేల సేకరణపై ఆసక్తి కలిగించేలా ఉంటుందని కలెక్టర్ అన్నారు. ఆ పుస్తకాన్ని రచించిన ఇద్దరినీ అభినందించారు. 1994 సంవత్సరం నుంచి ముద్రణ నిలిపేసిన రూ.రెండు నోట్లతో కలెక్టర్ మహేష్‌కుమార్ పేరును, రూ.20 నోటుపై కలెక్టర్ పుట్టిన తేదీ వచ్చేలా తయారు చేసి కలెక్టర్ మహేష్‌కుమార్‌కు కృష్ణ కామేశ్వర్ అందించారు. విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్, నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్, రచయిత చక్కా సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటలిజెన్స్ డీఎస్పీగా మురళీమోహన్



అమలాపురం టౌన్: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఇంటలిజెన్స్ డీఎస్పీగా సుంకర మురళీమోహన్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఏసీపీగా పనిచేస్తూ ఈయన బదిలీపై రెండు జిల్లాల ఇంటలిజెన్స్ డీఎస్పీగా వచ్చారు. మురళీమోహన్‌కు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దాదాపు రెండు దశాబ్దాలకు పైగా ఎస్సై, సీఐ, డీఎస్పీగా పలుచోట్ల పనిచేసిన అనుభవం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఏసీబీ అధికారిగా పనిచేశారు. కాకినాడ, అమలాపురంలో ఉన్న ఆయా జిల్లాల ఇంటలిజెన్స్ కార్యాలయాల్లో ఆయన విధులు నిర్వహిస్తారు. జిల్లాల పునర్విభజన తర్వాత మురళీమోహన్ కోనసీమ జిల్లా దిశ డీఎస్పీగా పనిచేసి మైలవరం బదిలీపై వెళ్లారు. ఇప్పుడు అక్కడ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

25 నుంచి సైన్స్ సంబరాలు

అమలాపురం టౌన్: జిల్లాలో ఈ నెల 25 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు–2024 ప్రారంభమవుతాయని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర నాయకుడు, చెకుముకి సంపాదక వర్గ సభ్యుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాల వాల్ పోస్టర్లను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలను ఈ నెల 25న పాఠశాల స్థాయి, అక్టోబర్ 1న మండల స్థాయి, అక్టోబర్ 27న జిల్లా స్థాయిలో నిర్వహిస్తామని వివరించారు. ఈ సైన్స్ సంబరాల్లో విద్యార్థులు పాల్గొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం నింపాలన్నారు. జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, జేవీవీ ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ బీఎస్ వెంకటేశ్వరరావు, సమనస మాజీ సర్పంచ్ తోట బాబ్జీ, జి.నాయుడు పాల్గొన్నారు.

సిండికేట్‌లు



- నీకిది.. నాకది అంటూ మద్యం దుకాణాల పంపకాలు
- టీడీపీ ఆధ్వర్యంలో మాఫియా
- షాపులు, వాటి ఆధ్వర్యంలోని బెల్ట్ షాపులపై లెక్కలు
- దుకాణాలకు డీడీలు తీసే అంశంలోనూ సయోధ్య

సాక్షి, అమలాపురం: కూటమి ప్రభుత్వ కొత్త మద్యం పాలసీ ప్రకటన వెలువడగానే పాత సిండికేటుదారులు కాసులు దండుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త దుకాణాలకు ధరావత్తు ఇంకా నిర్ణయం కాలేదు. మద్యం అమ్మకాల నియమ నిబంధనలు ఖరారు కాకుండానే సిండికేట్‌ల సమావేశాలు జరిగిపోతున్నాయి. గడిచిన నాలుగైదు రోజులుగా నీకిది.. నాకది అనే పద్ధతిలో దుకాణాలు వారిలో వారే పంచుకుంటున్నారు.

జిల్లాలోని అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తం మండలంలో సోమవారం రాత్రి పాత మద్యం సిండికేట్‌దారుల మధ్య చర్చలు జరిగాయి. టీడీపీకి చెందిన ఒక మద్యం కింగ్ ఆధ్వర్యంలో ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురం, అంబాజీపేటల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసే దుకాణాలు... వాటికి చెల్లించాల్సిన ధరావత్తులపైనా, ఎవరి పేరుపై డీడీలు చెల్లించాలనే దానిపై ముందే ఒక అంచనాకు రావడం విశేషం. సాధ్యమైనంత వరకూ తమ వారికే దుకాణాలు వచ్చేలా చేయడం, కొత్త వారు వస్తే వారిని నయానో భయానో తమలో కలుపుకోవాలని ఒక నిర్ణయానికి వచ్చారు. కాదని కొత్తవారు ఎవరైనా స్వతంత్రంగా వస్తే వారికి నష్టాలు వచ్చేలా చేయాలని కూడా నిర్ణయించుకున్నారు.

దుకాణాలకు చెల్లించాల్సిన ధరావత్తు కూటమి ప్రభుత్వం భారీగా నిర్ణయించనుందని సమాచారం. తెలంగాణ ప్రభుత్వం రూ.రెండు లక్షలుగా పెట్టినందున ఇక్కడ ప్రభుత్వం కూడా ఇదే విధానం అవలంబిస్తారని అంచనా. ధరావత్తు తిరిగి ఇచ్చే అవకాశం లేనందున ఇంత పెద్ద మొత్తంలో సొమ్ము చెల్లించి డ్రా విధానంలో షాపులు పొందకపోతే మొత్తం సొమ్ములు నష్టపోతామని కొత్తవారు వచ్చే అవకాశం లేదు. దీంతో 90 శాతం దుకాణాలు సిండికేటుదారులు పొందే అవకాశం ఏర్పడింది. సిండికేటులో చక్రం తిప్పేది కూటమి నాయకులు కావడం వల్ల వారి సౌలభ్యం కోసం ధరావత్తు అధికం చేసినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అండదండలు ఉండడంతో పాత మద్యం సిండికేట్‌దారులు తమకే దుకాణాలు వస్తాయని లెక్కల్లో ఉన్నారు. అయితే ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో విధివిధానాలు వచ్చిన తరువాత మద్యం షాపుల విషయంలో సిండికేట్‌దారుల మధ్య సైతం స్పష్టత వచ్చే అవకాశముంది. ధరావత్తు అధికంగా ఉన్నా టీడీపీ పాలనలో మద్యం లూజు అమ్మకాలు, బెల్ట్ షాపులు, ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయాలు వంటి కారణాల వల్ల అధిక ఆదాయం వస్తోందని అంచనా వేసుకుంటున్నారు.

- అమలాపురం నియోజకవర్గంలో ప్రస్తుత మద్యం పాలసీ ప్రకారం 19 ప్రభుత్వ మద్యం అవుట్‌లెట్ షాపులు ఉన్నాయి. 2014–19 టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో సిండికేట్ ద్వారా 37 మద్యం షాపులు ఉండేవి. వీటికి అనుబంధంగా అనధికారంగా 220 బెల్ట్ షాపులు నడిచేవి. ఇందులో 90 శాతం నలుగురైదుగురు చేతుల్లోనే ఉన్నాయి. ఉప్పలగుప్తానికి చెందిన మద్యం కింగ్‌తోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్, అమలాపురానికి చెందిన ఒక బార్ యజమాని కుటుంబ సభ్యులు, జనసేనలో ఒక మండల స్థాయి నాయకుడు, అల్లవరానికి చెందిన కింగ్‌లు సిండికేట్‌పై పెత్తనం కోసం చక్రం తిప్పుతున్నారు. సిండికేట్‌లో వీరి పట్టు ఎలా ఉంటుందంటే.. గతంలో జరిగిన మద్యం లక్కీ డ్రాలో ఉప్పలగుప్తం గ్రామానికి సంబంధించి రెండు మద్యం షాపులను కొంతమంది యువకులు దక్కించుకున్నారు. గొల్లవిల్లి గ్రామానికి సంబంధించి ఓ పెద్ద వ్యాపారికి లక్కీ డ్రాలో షాపు తగలడంతో ఆ షాపును ఉప్పలగుప్తం గొల్లవిల్లి సరిహద్దులో పెట్టి తక్కువ రేట్లకు మద్యం విక్రయించారు. దీంతో యువకులు నష్టపోయి సిండికేట్‌కు దుకాణాలు అప్పగించారు. పలువురిని ఇదే విధంగా చేశారు.
- కొత్తపేట నియోజకవర్గం కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో 30 మద్యం షాపులు ఉన్నాయి. ఆ విధంగా కొత్తపేట మండలంలో 10, రావులపాలెం మండలంలో 10, ఆత్రేయపురం మండలంలో 3, ఆలమూరు మండలంలో 7 షాపులు ఉన్నాయి. ఇక్కడ కూడా దుకాణాలు దక్కించుకునేందుకు టీడీపీ నేతలు సిద్ధమవుతున్నారు.
- మండపేట నియోజకవర్గంలో పరోక్షంగా తమ అనుచరులు ముందు ఉంచి మద్యం షాపులను నిర్వహించడంలో టీడీపీ, జనసేన నేతలు సిద్ధహస్తులే. పాత వ్యాపారులు ముందస్తు సమావేశాలు ఏర్పాటు చేసుకుని సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేసేవారు. ఇప్పుడు కూడా ఇదే విధానాన్ని అవలంబిస్తున్నారు.
- ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో మత్స్యకార గ్రామాల్లో మద్యం షాపులపై పలువురు కన్నేశారు. ఇక్కడ ఆదాయం, బెల్టు, లూజ్ అమ్మకాలు అధికం. ఈ కారణంగా ఇక్కడ ఏర్పాటు చేసే దుకాణాలు తమ చేతుల నుంచి బయటకు వెళ్లకూడదని స్థానిక సిండికేట్‌దారులు సన్నాహాలు చేసుకుంటున్నారు.

బెల్ట్ షాపులు తొలగించాలి



కూటమి ప్రభుత్వం దశలవారీగా మద్య నిషేధం అమలు చేయాలి. ఇందులో భాగంగా ముందుగా గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చూడాలి. తరువాత లూజు విక్రయాలు నిలుపుదల చేయాలి. మద్యం అమ్మకాలు అనేది ఆదాయం మార్గంగా చూడడం సరికాదు. దాని కన్నా ముందు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది.

– కె.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అమలాపురం

మద్యాన్ని పూర్తిగా నిషేధించాలి



మద్యం వల్ల అనేక కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. దీనిని నిషేధించాలన్నది యావత్ ఆంధ్రా మహిళలు, ప్రగతిశీల శక్తుల డిమాండ్. కూటమి ప్రభుత్వం మద్యాన్ని నిషేధించకుండా విక్రయాలతో డబ్బు సంపాదించాలని చూస్తుంది. కొత్త పాలసీ అంటూ సామాన్య కుటుంబాలను చిదిమేసే నిర్ణయాలను కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి.

– కె.కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా నాయకురాలు, మండపేట

కబ్జా నుంచి విముక్తి

పోలీస్ అవుట్ పోస్టు స్వాధీనం



నాడు: చెక్‌పోస్ట్‌ను కబ్జా చేసి ఏర్పాటు చేసిన జనసేన నేతల ఫ్లెక్సీ



నేడు: పామర్రు అవుట్ పోస్ట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి ఏటిగట్టుపై పోలీస్ అవుట్ పోస్ట్‌ను శుక్రవారం భారీ బందోబస్తు మధ్య పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జూలై 19న ఎక్సైజ్ చెక్ పోస్ట్‌ను కబ్జా చేసిన జనసేన నేతలు అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం వచ్చింది. దీనిపై జిల్లా స్థాయి పోలీస్ అధికారులు స్పందించారు. గతంలో ఎక్సైజ్ చెక్ పోస్ట్‌ను స్థానిక పోలీసులకు అప్పగించారు. అనంతరం స్థానిక పోలీసులు ఇక్కడ శాశ్వతంగా షెడ్డు నిర్మించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం ఈ చెక్‌పోస్ట్‌ను జనసేన నేతలు స్వాధీనం చేసుకుని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో పాటు మంత్రి సుభాష్ ఫోటోలతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనిపై 'సాక్షి' దినపత్రికలో కథనం వచ్చిన తరువాత స్పందించిన పోలీసులు జనసేన నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించారు. తర్వాత పోలీస్ అవుట్ పోస్ట్ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి అధికారికంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై జానీబాషా మాట్లాడుతూ ఇది పోలీసులకు సంబంధించిన కట్టడమని, కబ్జా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

తడిసి ముద్దయిన కోనసీమ



అమలాపురం పట్టణంలో వర్షానికి రోడ్డుపైకి చేరిన నీరు

- ఏకధాటిగా కురిసిన వర్షం
- రోడ్లపైకి చేరిన నీరు
- ఎండ నుంచి కాస్త ఉపశమనం

సాక్షి, అమలాపురం: రెండున్నర గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో జిల్లా తడిసి ముద్దయ్యింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ వాతావరణం మేఘావృతమైంది. కానీ తరువాత నుంచి రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఐదున్నర గంటల వరకూ వర్షం కురవడంతో అమలాపురంలో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పట్టణంలో ఈదరపల్లి వంతెన దిగువన, ఎస్‌కేబీఆర్ కాలేజీ, సాంబమూర్తి ఆస్పత్రి, సుబ్బారాయుడు చెరువు, అశోక్‌నగర్ వద్ద ప్రధాన రోడ్లపై వర్షపు నీరు చేరింది. కుమ్మరి కాలువలో నీరు చేరడంతో కాలువ పొంగి ప్రవహిస్తోంది. పలుచోట్ల డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చింది. ఏకధాటిగా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. దట్టమైన మేఘాలు కమ్ముకుని వర్షం పడుతుండడంతో సాయంత్రం ఐదు గంటల సమయంలోనే కార్లు, లారీలు, బస్సులకు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. పట్టణంతోపాటు అమలాపురం మండలం రోళ్లపాలెం, కామనగరువు, పేరూరు, బండారులంకల్లో సైతం రోడ్లపై, లోతట్టు కాలనీల్లో వర్షపు నీరు చేరింది. అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లిలో భారీ వర్షం కురిసింది. వీటితోపాటు కొత్తపేట, మండపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గడిచిన వారం రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలతో సామాన్యులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సగటు ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల నుంచి 35 డిగ్రీల మధ్య నమోదు అవుతుండడంతో జనం ఆపసోపాలు పడ్డారు. ఎండల దెబ్బకు ఉద్యాన, కూరగాయ పంటలు తలలు వాల్చాయి. ఈ సమయంలో కురిసిన వర్షంతో జనంతోపాటు సేదతీరగా, పంటలకు ఉపయుక్తంగా మారింది.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక



క్రీడాకారులకు నగదు అందజేస్తున్న ఎంపీటీసీ ప్రశాంత్, హెచ్‌ఎం

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా అండర్–14, 17 పోటీలకు ఇసుకపూడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఏఎల్ వరప్రసాద్ తెలిపారు. విజేతలను ఆ హైస్కూల్‌లో శుక్రవారం అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న డిస్ట్రిక్ట్ స్పోర్ట్ అసోసియేషన్ గ్రౌండ్‌లో జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సెపక్ తక్రా అండర్– 14 బాలికల విభాగంలో కన్నేడి పూర్ణ లక్ష్మీప్రసన్న, అండర్– 17లో నామాడి జ్యోత్స్నలు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చిన పీడీ బూల చిరంజీవిని, పూర్ణ లక్ష్మీప్రసన్న, నామాడి జ్యోత్స్నలను పీఎంసీ చైర్మన్ పళ్ల స్వామినాయుడితో పాటు పలువురు అభినందించారు. వీరికి పలువురు నగదు అందించి ప్రోత్సహించారు.

57 లక్షల ఉపాధి పని దినాలు లక్ష్యం



అంబాజీపేటలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న పీడీ మధుసూదనరావు

అంబాజీపేట: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 సంవత్సరానికి జిల్లాలో 57 లక్షల పని దినాలను పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు ఉపాధి హామీ పథకం పీడీ ఎస్.మధుసూదనరావు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వి.సరోవర్ అధ్యక్షతన 16వ ఉపాధి హామీ సోషల్ ఆడిట్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ 79 శాతం మేర 44.02 లక్షల పని దినాలను పూర్తి చేశామన్నారు. ఈ పనులకు సంబంధించి మొత్తం రూ.156 కోట్లు కాగా ఇప్పటివరకూ రూ.130 కోట్లు వేతన రూపంలో కూలీలకు చెల్లించామన్నారు. మెటీరియల్స్ నిమిత్తం రూ.27 కోట్లు ఖర్చు చేశామన్నారు. 1.64 లక్షల కుటుంబాలు వంద రోజులు పనులు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 2,285 కుటుంబాల లక్ష్యం పూర్తి చేశారన్నారు. వంద రోజులు పని పూర్తి చేసి జిల్లాలో మలికిపురం మండలం ప్రథమ స్థానం, అమలాపురం ఆఖరిలో ఉందన్నారు. అనంతరం ఎంపీడీఓ సరోవర్ మాట్లాడుతూ 2023–24కు మండలంలో ఉపాధి పనులకు సంబంధించి 774 పనులు చేపట్టగా మెటీరియల్ వర్కులు 19, గోకులం శాల ఒకటి పూర్తి చేశామన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఏపీఓ ఎ.వెంకట కృష్ణ, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీ మట్టా పార్వతి, స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎస్.మాధవ్, జిల్లా విజిలెన్స్ అధికారి కర్రి భీమేశ్వరరావు, అంబుడ్స్‌మెన్ ఏవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌లో కొత్త సర్కిళ్లు

- ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం
- కాకినాడ, అమలాపురంలలో ఏర్పాటు కానున్న కార్యాలయాలు

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్)లో కొత్త సర్కిళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలుగా ఏర్పడింది. ప్రస్తుతం విద్యుత్ శాఖ తూర్పుగోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం సర్కిల్ నుంచి కాకినాడ, కోనసీమ జిల్లాల కార్యకలాపాలు నిర్వహిస్తోంది. జిల్లాలు విభజన అనంతరం కాకినాడ, కోనసీమలకు కొత్త సర్కిళ్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మేరకు ఆ జిల్లాల్లో ఎస్‌ఈ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. రంపచోడవరం కార్యకలాపాలు మాత్రం తూర్పుగోదావరి జిల్లాలోనే కొనసాగనున్నాయి.

ఉద్యోగుల నియామకంపై కసరత్తు

కొత్త జిల్లాలకు ఏర్పాటైన కొత్త సర్కిళ్లలో అక్టోబర్ నెల నుంచి సర్కిల్ ఎస్‌ఈ, ఎస్‌ఏఓల నియామక ప్రక్రియ చేపట్టేందుకు కార్పొరేట్ కార్యాలయం కసరత్తు ప్రారంభించింది. దీంతో ఎస్‌ఈ పోస్టులకు డిమాండ్ ఏర్పడింది. కాకినాడ, కోనసీమ (అమలాపురం) సర్కిళ్లకు ఎస్‌ఈలుగా వచ్చేందుకు కార్పొరేట్ కార్యాలయంలోని జనరల్ మేనేజర్ స్థాయి అధికారి, జీఎం క్యాడర్ మహిళా అధికారి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. గతంలో అమలాపురం డీఈగా పనిచేసి అక్వా రంగంలో మంచి పట్టు, అనుభవం ఉన్న అధికారిని భీమవరం కొత్త సర్కిల్‌కు ఎస్‌ఈగా నియమించే అవకాశాలున్నాయి. భీమవరం కొత్త సర్కిల్‌కు సీనియర్ అకౌంట్స్ అధికారిగా విశాఖలోని కార్పొరేట్ కార్యాలయంలో అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగిని నియమించారు.

నిలువునా విషం కక్కుతూ..

- సచివాలయ వ్యవస్థపై కూటమి సర్కారు కంటగింపు
- ఉద్యోగులకు అదనపు పనిభారం
- సేవల కుదింపుతో ప్రజల అవస్థలు



పెదపళ్ల గ్రామ సచివాలయంలో సేవలందిస్తున్న ఉద్యోగులు

ఆలమూరు: సచివాలయం.. ఆ మాట వినగానే సేవలకు నిలయం అనే పేరు గుర్తొస్తుంది. ప్రజల వద్దకే సేవలు అందించాలనే సదుద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థకు జీవం పోసింది. వీటి ద్వారా అవినీతి రహిత సేవలు అందించిన గత ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకుంది. ప్రజా పాలనలో అద్భుతాలను సృష్టించింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థను ప్రజలకు దూరం చేయాలనే దురుద్దేశంతో ఇప్పటి కూటమి ప్రభుత్వం విషం కక్కుతోంది. సచివాలయ ఉద్యోగులకు మరిన్ని బాధ్యతలు అప్పగించి పని ఒత్తిడి పెంచేసింది. వలంటీర్ వ్యవస్థను పక్కనపెట్టి ఆ విధులనూ సచివాలయ ఉద్యోగులపై వేసింది.

2019 ముందు వరకూ విద్యార్థులు, రైతులు, సాధారణ ప్రజలు ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే మండల కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ పథకాలు పొందాలన్నా తీవ్ర అవస్థలు పడేవారు. ఈ అవరోధాలను ప్రజా సంకల్ప యాత్ర ద్వారా చూసిన జగన్ తాను అధికారంలోకి రాగానే పాలనను ప్రజల వద్దకు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అపూర్వ మద్దతుతో అధికారంలోకి వచ్చిన అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. 2019 ఆగస్టు 15న గ్రామ వలంటీర్, అక్టోబర్ 2న గ్రామ సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. అనతికాలంలోనే గ్రామ స్థాయిలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడంతో ఈ వ్యవస్థ ప్రజలకు చేరువైంది. జిల్లాలోని అనేక గ్రామాల్లో అరగంటలో రేషన్ కార్డును మంజూరు చేసి రాష్ట్ర వ్యాప్తంగా విమర్శకుల ప్రశంసలూ అందుకుంది. ఒక్కో సచివాలయంలో 8 నుంచి 14 మంది ఉద్యోగులను నియమించి సుమారు 540 సేవలు అందించేందుకు ప్రణాళికలకు రూపకల్పన చేసింది. కేరళ తదితర రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు ఇక్కడకు వచ్చి ఈ వ్యవస్థను పరిశీలించి అభినందించి వెళ్లారు. అలాంటి వ్యవస్థను నేటి కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ ఇష్టానుసారంగా విధులను కేటాయిస్తూ ఉద్యోగులతో ఆటలాడుతోంది.

సేవలకు మంగళం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామ సచివాలయ వ్యవస్థకు మూలాధారమైన రేషన్ కార్డుల జారీ, పింఛన్ల నమోదు, ఆరోగ్యశ్రీ కార్డుల మంజూరు వంటి అత్యవసరమైన ప్రధాన సేవలను సగానికి పైగా నిలిపివేసింది. గ్రామ సచివాలయాల్లో కేవలం ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయడానికి, విద్యుత్ బిల్లులు చెల్లింపు వంటి సేవలకే పరిమితం చేసింది. అదే సమయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఇసుక ర్యాంపుల వద్ద విధులను కేటాయించడం, పింఛన్లు పంపిణీ చేయించడం, పాఠశాలల నిర్వహణ (ఎండీఎఫ్), జల్‌జీవన్ (ఓడీఎఫ్) సర్వే, వరద నియంత్రణ విధులు తదితర బాధ్యతలు అప్పగిస్తుంది. గ్రామ సచివాలయ ఉద్యోగులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నా, కొన్నిచోట్ల కూటమి నేతల ఆగడాలు, చీత్కారాలు, చులకన భావాన్ని తట్టుకోలేక ఉద్యోగులు నలిగిపోతున్నారు.

జిల్లాలో జనాభా, ప్రభుత్వ కార్యాలయాలు

జిల్లా జనాభా	17,19,013
మండలాలు	22
మున్సిపాలిటీలు	03
నగర పంచాయతీ	01
గ్రామాలు	385
రెవెన్యూ గ్రామాలు	314
గ్రామ సచివాలయాలు	467
వార్డు సచివాలయాలు	48
గ్రామ/వార్డు సచివాలయాలు	515
గ్రామ సచివాలయ ఉద్యోగులు	4,065

గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఖ్య

పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్ –5)	404
పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్–6)	418
ఇంజినీరింగ్ అసిస్టెంట్లు (గ్రేడ్–2)	387
వెల్ఫేర్ అసిస్టెంట్లు	444
అగ్రికల్చర్ అసిస్టెంట్లు	276
హార్టికల్చర్ అసిస్టెంట్లు	128
వెటర్నరీ అసిస్టెంట్లు	222
మత్స్యకార శాఖ అసిస్టెంట్లు	28
గ్రామ రెవెన్యూ అధికారులు	424
గ్రామ సర్వేయర్లు	357
మహిళా పోలీసు	424
గ్రామ ఆరోగ్య సంరక్షణ కార్యదర్శులు	431
ఎనర్జీ అసిస్టెంట్లు	122

క్లుప్తంగా

అన్నవరం దేవస్థానం ఈఓ కొనసాగింపు


దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా, అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి (ఫుల్ అడిషనల్ చార్జి) ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.రామచంద్రమోహన్‌ను మరి కొంత కాలం ఈఓగా కొనసాగిస్తూ రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతన ఈఓను నియమించే వరకూ ఆయన ఈ బాధ్యతలు నిర్వహిస్తారని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్ 19న ఆయన ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. వచ్చే నెల మూడో తేదీ నుంచి దసరా, నవంబర్ రెండో తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో దేవస్థానంలో అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. దీనికోసం ఆయనను కొనసాగిస్తూ ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. కాగా, ఈఓ రామచంద్రమోహన్ 'సాక్షి'తో మాట్లాడుతూ వచ్చే వారంలో సత్యదేవుని ఆలయ శిఖరం బంగారు తాపడం పనులు, కార్తిక మాసం ఏర్పాట్లపై అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు.

అంతర్ జిల్లాల దొంగ అరెస్ట్

ఐ.పోలవరం: పలు జిల్లాల్లో మోటారు సైకిళ్ల దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని ఐ.పోలవరం పోలీసులు అరెస్టు చేశారు. భీమవరం జిల్లా మోగల్తూరు మండలం శేరుపాలెం గ్రామానికి చెందిన రంగిశెట్టి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐ.పోలవరం ఎస్సై కె.భానుప్రసాద్ శుక్రవారం తెలిపారు. ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, నరసాపురం తదితర ప్రాంతాల్లో శ్రీనివాస్ ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. ఈ వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి ముమ్మిడివరం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ పడిందని ఎస్సై తెలిపారు.

డ్వాక్రా అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌కు జైలు

కాకినాడ లీగల్: డ్వాక్రా గ్రూపుల సొమ్ము సొంతానికి తీసుకున్న కేసులో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం)కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలాశ్యామ్ సుందరి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పెదపూడి మండల డ్వాక్రా అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా బొద్దాని రాధా అపర్ణ పనిచేసేది. ఆ సమయంలో డ్వాక్రా యానిమేటర్లను వేధించి గ్రూపుల్లో ఉన్న సొమ్ము రూ.12,74,500ను సొంతానికి వాడుకుంది. దీనిపై 2015లో డ్వాక్రా యానిమేటర్లు పెదపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో రాధాఅపర్ణ నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

మళ్లీ చెలరేగిన అల్లర్లు..

- కొవ్వూరులో రెండో రోజూ కొనసాగిన దాడులు
- అడుగడుగునా పోలీసు బలగాల మోహరింపు


కొవ్వూరులో ఇరువర్గాల ఘర్షణ వద్ద గుమిగూడిన జనం

కొవ్వూరు: కొవ్వూరు మళ్లీ రావణ కాష్టమైంది.. ఇరు వర్గాల దాడులతో అట్టుడుకింది.. గురువారం రాత్రి గణేశ విగ్రహ నిమజ్జనోత్సవంలో జరిగిన ఘర్షణ ఇరువర్గాల మధ్య దాడులకు ఉసిగొల్పింది.. ఈ చిచ్చు మళ్లీ శుక్రవారం రేగింది. ఈ పట్టణంలో రెండో రోజూ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఇక్కడి ఇరువర్గాలకు చెందిన శ్రీరామకాలనీ (తుని పేట), రాజీవ్ కాలనీల్లో అడుగడుగునా పోలీసు బలగాలు మోహరించాయి. ఎక్కడికక్కడే ప్రధాన కూడళ్లలో గస్తీ కాస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం మరోసారి కొట్లాట చోటుచేసుకోవడంతో పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకున్నారు. ఒక వర్గానికి చెందిన నలుగురు యువకులు మద్యం దుకాణానికి రావడంతో, మరోవర్గం యువకులు వారిని వెంటాడి దాడి చేశారు. అప్రమత్తమైన పోలీసులు ఇద్దరిని తమ వాహనంలో ఎక్కించుకుని కాపాడారు. మరో యువకుడు పారిపోగా, ఒకరిపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని రాజీవ్ కాలనీకి చెందిన కొందరు అల్లరిమూకలు శ్రీరామ కాలనీపై పడి విధ్వంసం సృష్టించాయి. మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ ఘటనతో ఇరువర్గాలకు చెందిన వందలాది మంది రోడ్డుపైకి రావడంతో వారిని నియంత్రించడం పోలీసులకు కష్టమైంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాజీవ్‌కాలనీ వాసులు శ్రీరామ కాలనీ మీదుగా వెళ్లే రహదారిపై ముళ్ల కంచెలు, స్టాఫర్లు అడ్డుపెట్టి పోలీసులు పూర్తిగా మూసివేశారు. ఈ మార్గంలో పోలీసు బలగాలు, రెస్క్యూ టీమ్‌లు మోహరించాయి. మరోవైపు ఇరుపక్షాలతో ఆయా కుల సంఘాల నాయకుల ద్వారా శాంతి చర్చలు నడుస్తున్నాయి. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏవిధమైన అల్లర్లు చెలరేగకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అల్లర్లకు పాల్పడుతున్న వారిని గుర్తించే పనిలో పోలీసు అధికారులు నిమగ్నమయ్యారు. అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్, ఏఆర్ డీఎస్పీ సీవీఆర్‌కే రవికుమార్, సెంట్రల్ డీఎస్పీలతో పాటు కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, రాజమహేంద్రవరం ఏఆర్ బెటాలియన్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఈ నెలాఖరు వరకూ 144 సెక్షన్

ఈ నెలాఖరు వరకూ శ్రీరామకాలనీ, రాజీవ్ కాలనీల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని డీఎస్పీ జి.దేవకుమార్ ప్రకటించారు. ఇప్పటికే వంద మందికి పైగా పోలీసులు నిరంతరం గస్తీ కాస్తున్నారని అన్నారు. అల్లర్ల నేపథ్యంలో పోలీసు యాక్ట్ 30 సైతం అమలులో ఉందన్నారు. ఇరుపక్షాల ఫిర్యాదులపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. ఒక్కో వర్గంలో వంద మంది చొప్పున రెండు వందల మందిపై కేసు నమోదు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పట్టణంలో రెండు కులాల మధ్య చోటుచేసుకున్న వివాదంలో వినాయక నిమజ్జనాలు సైతం రాత్రి ఏడు గంటల లోపే ముగించాలని నిర్వాహకులను ఆదేశించామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఇరువర్గాలతో శాంతి చర్చలు

ఇరు పక్షాలు ఒకవర్గంపై మరో వర్గం దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో ఈ వివాదాన్ని సర్దుబాటు చేసేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. సామరస్య పూర్వకమైన వాతావరణంలో వివాదాన్ని పరిష్కరించేందుకు అవకాశం ఇచ్చారు. ఇరుపక్షాల నుంచి ఆరుగురు చొప్పున పెద్దలను పిలిచి మాట్లాడుతున్నారు. గురువారం రాత్రి నుంచి చర్చల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులకు తలనొప్పిలా మారింది. శాంతి చర్చల్లో దాడులకు తెగబడిన ఇరుపక్షాల వారిపై కేసులు నమోదు చేయడం ప్రధాన అజెండాగా చెబుతున్నారు. చర్చలు ఫలిస్తే పరిస్థితి చక్కబడే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉంటే దాడుల నేపథ్యంలో కొవ్వూరు, దొమ్మేరులలో మద్యం దుకాణాలను మూసివేశారు.


రాజీవ్ కాలనీకి వెళ్లే రహదారిని మూసివేసిన పోలీసులు

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య


చెల్లు వెంకన్న (ఫైల్)

అంబాజీపేట: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ముక్కామల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక ప్రాంతానికి చెందిన చెల్లు వెంకన్న (56) తన ఇంటి సమీపంలోని తాటాకు పాకలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఇక్కడ సరిగ్గా పనులు లేకపోవడంతో రెండు వారాల కిందట హైదరాబాద్‌లో తన కుమార్తెల ఇంటికి వెళ్లాడు. అనంతరం వారం కిందట తిరిగి ఇంటికి వచ్చాడు. అప్పులు బాధలు ఎక్కువ కావడంతో సమీప బంధువుకు తన స్థలాన్ని రూ.7.01 లక్షలకు విక్రయించాడు. దీనికి అడ్వాన్స్‌గా రూ.1.50 లక్షలను వెంకన్న తీసుకున్నాడు. ఈ నెల 19వ తేదీ రాత్రి ఇంటి బయట నిద్రిస్తానని అతని భార్య నాగమణికి చెప్పాడు. ఉదయం లేచి చూసేసరికి వెంకన్న పాకలో ఉరి వేసుకుని ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పుల బాధ వల్లే మృతిచెంది ఉంటాడని అంటున్నారు. మృతునికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. మృతుని అన్న కుమారుడు చెల్లు వెంకట దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై చెప్పారు.

విస్ఫోట క్షతగాత్రురాలి మృతి

- ఏడుగురికి కొనసాగుతున్న చికిత్స
- నిలకడగా వారి ఆరోగ్యం


గొవ్వాల నాగలక్ష్మి (ఫైల్)


నాగలక్ష్మి బంధువులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం రావులచెరువు ప్రాంతంలో బాణసంచా విస్ఫోటం ఘటనలో గాయాలపాలై స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గొవ్వాల నాగలక్ష్మి (56) శుక్రవారం ఉదయం మృతి చెందింది. విస్ఫోటంలో ఇల్లు తునాతునకలైంది. ఈ ఘటనలో ఇంటి యజమాని గొవ్వాల నాగేశ్వరరావు భార్య నాగలక్ష్మి కూడా తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. తలకు తీవ్రగాయం కావడంతో ఆమెకు న్యూరాలజిస్టులు శస్త్రచికిత్స చేసి ప్రత్యేక వైద్యం అందిస్తున్నా ఘటన జరిగిన ఐదు రోజులకు మృత్యువాత పడింది. ఈ ప్రమాదంలో మొత్తం 14 మంది గాయపడగా అందులో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఆరుగురు స్వల్పంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఘటన జరిగిన గత సోమవారమే ఇంటికి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మంది స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంటి యజమాని గొవ్వాల నాగేశ్వరరావుతో పాటు ఆ ఇంటి కుటుంబీకులు మొత్తం గాయపడ్డారు. ఇప్పుడు భార్య నాగలక్ష్మి మృతి చెందగా మిగిలిన ఏడుగురికి వైద్యం కొనసాగుతోంది. వారి ఆరోగ్యం బాగానే ఉందని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. నాగలక్ష్మి మృతి చెందిన వార్త తెలియగానే వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు స్థానిక కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి ఆమె కుటుంబీకులు, బంధువులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ కూడా నాగలక్ష్మి కుటుంబీకులను పరామర్శించారు.

పడి లేచిన పొగాకు ధర

- లోగ్రేడ్ రకానికీ మంచి రోజులు
- రైతుల మోములో ఆనందం
- కిలోకు రూ.120 పెరుగుదల


వేలం కేంద్రంలో పొగాకు కొనుగోలు చేస్తున్న ట్రేడర్లు

దేవరపల్లి: లోగ్రేడు పొగాకు ధర మార్కెట్లో క్రమేపీ పెరుగుతోంది. మొన్నటి వరకూ కిలో రూ. 120 పలకడంతో రైతులు ఢీలా పడ్డారు. ఏప్రిల్, మే నెలల్లో లోగ్రేడు పొగాకు ధర రూ. 270 నుంచి రూ.305 పలకడంతో అప్పట్లో అమ్ముకున్న రైతులకు మంచి ఆదాయం వచ్చింది. తర్వాత దీని కొనుగోలుకు ట్రేడర్లు ముందుకు రాకపోవడంతో కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేశారు. బ్రైట్ పొగాకు అమ్మకాలు పూర్తి కావడంతో గత రెండు వారాలుగా మీడియం, లోగ్రేడు పొగాకు కొనుగోళ్లు ప్రారంభించారు. అయితే లోగ్రేడు పొగాకు కొనుగోలుకు ట్రేడర్లు ఆసక్తి చూపకపోవడంతో ధర పతనమైంది. కిలో ధర రూ. 150 పలకడంతో రైతులు రెండు రోజులు వేలాన్ని అడ్డుకుని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన వేలంలో కిలో రూ. 150 నుంచి రూ.120 పలికింది. చేసేదిలేక రైతులు వచ్చినకాడికే చాలు అనుకుని కిలో రూ. 120కు విక్రయించారు. ఒకటి రెండు కంపెనీలు మాత్రమే లోగ్రేడు పొగాకు కొనుగోలు చేయడంతో పోటీ లేక ధర పతనమైంది. బుధవారంతో దేవరపల్లి వేలం కేంద్రంలో పొగాకు అమ్మకాలు ముగిశాయి. గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలలోని వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు జరుగుతున్నాయి. అక్కడ లోగ్రేడు పొగాకుకు రెండు రోజుల నుంచి డిమాండ్ పెరిగింది. జీపీఐ కంపెనీకి లోగ్రేడు పొగాకుకు ఎగుమతి ఆర్డర్లు రావడంతో కొనుగోలుకు దూకుడు పెంచారు. వీరితో పాటు ఐటీసీ సంస్థ కూడా కొనుగోలుకు ముందుకు రావడంతో మార్కెట్లో పోటీ ఏర్పడింది. దీంతో మార్కెట్లో కిలో లోగ్రేడు ధర రూ. 240 పలుకుతుంది. ఈ ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. ముందుగా అమ్ముకున్న దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని రైతులు కిలోకు రూ. 100 నుంచి 120 నష్టపోయామని వాపోతున్నారు.

నేటితో గోపాలపురంలో ముగింపు

గోపాలపురం వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు శనివారంతో ముగుస్తాయని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు బేళ్ల అమ్మకానికి 952 రాగా, 847 బేళ్లు కొనుగోలు చేశారన్నారు. మిగిలిన బేళ్లు శనివారం కొనుగోలు చేస్తారని, దీంతో 2023–24 ఏడాదిలో పండించి పొగాకు కొనుగోళ్లు ముగుస్తాయని ఆయన తెలిపారు. కిలో బ్రైట్ గ్రేడు గరిష్ఠ ధర రూ. 410 పలుకుతుందన్నారు. ఈ నెల 25 నాటికి ఎస్ఎల్ఎస్ పొగాకు విక్రయాలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

దాడి కేసులో మూడేళ్ల జైలు

తుని రూరల్: తుని మండలం వి.కొత్తూరులోని కేజీబీవీలో అధ్యాపకురాలు ముక్కుడుపల్లి మధురాక్షిపై ఆమె భర్త రాజేశ్వరరావు కత్తితో దాడి చేయడంతో నిందితుడికి పిఠాపురం అసిస్టెంట్ సివిల్ జడ్జి ఎం.బాబు మూడేళ్లు జైలు శిక్ష, రూ.మూడు వేల జరిమానా విధించినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి శుక్రవారం తెలిపారు. 2020 సెప్టెంబర్ 16న బాధితురాలి సోదరుడు సీహెచ్ నాగవెంకట సత్యశివ ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఎస్సై వై.గణేష్ కేసు నమోదు చేశారు. రూ.50 లక్షలు అదనపు కట్నం ఇవ్వాలని డిమాండ్ చేసినా ఇవ్వకపోవడంతో తన సోదరి మధురాక్షిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి ఆధారాలు కోర్టుకు సమర్పించడంతో జడ్జి తీర్పు ఇచ్చారని ఎస్సై తెలిపారు.

సెంట్రల్ జైలు ఖైదీ మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఖైదీ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. జైలు అధికారుల వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా బలుపులపాడు మండలం వసంతవాడకు చెందిన సంగం శ్రీనివాసరావు (47) తన తల్లిని హత్య చేసిన కేసులో 2017 జూన్ 24న సెంట్రల్ జైలుకు వచ్చాడు. అతను జైలుకు వచ్చిన నాటి నుంచి షుగర్, గుండె వ్యాధితో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించడంతో జైలు అధికారులు అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందాడు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. పట్టాలపై మృతదేహం ఉండటంలో రైల్వే ఎస్ఎస్ బి.కిశోర్ సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం సాయంత్రం సంఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. రైలు నుంచి జారిపడి మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతురాలి వయసు సుమారు 65 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని పెద్దాపురం ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఎస్సై బి.లోవరాజు తెలిపారు.

సబ్జెక్ట్ టీచర్ల నియామకానికి దరఖాస్తులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు టీచర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయాధికారి జి.వెంకటరావు శుక్రవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి బాలుర గురుకులంలో ఇంగ్లిషు పోస్టు 1, మ్యాథ్స్ 1 పోస్టులకు పురుషులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదే విధంగా బాలిక గురుకులంలో ఇంగ్లిష్–2, జువాలజీ 1, ఫిజికల్ సైన్స్ 1 పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు అందించాలన్నారు. వీరిని గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన భర్తీ చేస్తారన్నారు. గతంలో గురుకులాల్లో పని చేసిన వారికి ఏడాదికి ఒక మార్కు, గరిష్ఠంగా ఐదు మార్కులు కలుపుతారన్నారు. ఆసక్తిగల పురుష, మహిళా అభ్యర్థుల నుంచి వారి బయోడేటాతో పాటు ధ్రువపత్రాల నకళ్లను ఈ నెల 24వ తేదీ లోపు జిల్లా కోఆర్డినేటర్ ఆఫీసు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ, కలెక్టరేట్ కాంపౌండ్, వికాస ఆఫీస్ పైన, కాకినాడ అనే చిరునామాలో అందజేయాలన్నారు. విద్యార్హతలకు సంబంధించిన సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఎడ్ మరియు టెట్‌ల్లో అర్హత పొంది ఉండాలని సమన్వయాధికారి వెంకటరావు తెలిపారు.

కనకదుర్గమ్మకు బంగారు కిరీటం సమర్పణ


బంగారు కిరీటం


అమ్మవారి సేవకులకు కిరీటాన్ని అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం: గోకవరంలో ప్రసిద్ధి గాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన శ్రీకనకదుర్గమ్మ వారికి రూ.21 లక్షలతో తయారు చేయించిన బంగారు కిరీటాన్ని దాత కంబాల శ్రీనివాసరావు, భక్తులు అందజేశారు. గతేడాది శరన్నవరాత్ర ఉత్సవాల్లో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అమ్మవారికి బంగారు కిరీటాన్ని చేయిస్తానని సంకల్పించారు. సుమారు రూ.21 లక్షలతో రత్నాలతో పొదిగిన బంగారు కిరీటాన్ని చేయించడానికి సంకల్పించి భక్తులను సైతం భాగస్వాములను చేయడానికి పిలుపునిచ్చారు. ఆయన పిలుపు మేరకు భక్తులు సుమారు రూ.7 లక్షలు విరాళాలు అందించగా, మిగిలిన రూ.14 లక్షలు సమకూర్చి కిరీటాన్ని తయారు చేయించారు. శుక్రవారం సర్వాంగ సుందరంగా తయారు చేసిన నవరత్నాల బంగారు కిరీటాన్ని కంబాల శ్రీనివాసరావు ఆలయ అర్చకులకు, అమ్మవారి సేవకులకు, గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి స్వర్ణ కిరీటాన్ని మండలంలో అన్ని గ్రామాల్లో ఊరేగించి ఈ ఏడాది శరన్నవరాత్ర ఉత్సవాల్లో అమ్మవారికి అలంకరిస్తామన్నారు. అలాగే రూ.15 లక్షలతో అమ్మవారి రథం కూడా తయారు చేయిస్తున్నామని, త్వరలో సిద్ధమవుతుందన్నారు. కార్యక్రమంలో దాసరి తమ్మన్నదొర, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, ఇనకోటి బాపన్నదొర, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, ఆలయ సేవకుడు ఇనకోటి పెద్దులు, ఆచంట రాజు పాల్గొన్నారు.

వేధింపుల నుంచి కాపాడండి

స్వదేశానికి రప్పించాలని బాధితురాలి వేడుకోలు


సారథి దేవీ హేమలత

రాయవరం: జీవనోపాధి నిమిత్తం ఖతర్ వెళ్లిన ఓ మహిళ అక్కడ తనకు జరుగుతున్న బాధలను సోషల్ మీడియా వేదికగా వెల్లడించి, ఇండియా తీసుకువెళ్లాలని వేడుకుంది. తనను రక్షించి తన పిల్లల వద్దకు చేర్చాలని, ప్రభుత్వం తన పట్ల దయ చూపించాలని ఆ వీడియోలో కోరింది. దానికి సంబంధించిన వీడియోలో ఆ మహిళ ఆవేదన ఈ విధంగా ఉంది. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన రాయవరం గ్రామానికి చెందిన సారథి దేవీ హేమలత స్థానికంగా ఫ్యాన్సీ షాపులో పనిచేసేది. కుటుంబ పోషణ నిమిత్తం భర్త మధుబాబు, ఇద్దరు ఆడ పిల్లలను వదిలి జీవనోపాధి కోసం ఖతర్ వెళ్లింది. 2023 నవంబర్‌లో ఏజెంటు ద్వారా ఖతరు వెళ్లిన ఆమె.. అక్కడ పరిస్థితులు మరోలా ఉన్నాయని ఆ వీడియోలో వెల్లడిస్తూ ఆవేదన చెందింది. భారత కరెన్సీలో రూ.25,000 జీతంతో ఇంటిలో క్లీనింగ్ పని అని చెప్పి తనను ఖతర్ పంపించారని పేర్కొంది. తీరా అక్కడకు వెళ్లిన తరువాత రాత్రి అనక, పగలనక తనతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని, ఆరోగ్యం బాగుండకపోయినా తనతో పనిచేయిస్తున్నారని చెప్పింది. ఆరోగ్యం బాగుండకపోతే ఆస్పత్రికి కూడా తీసుకువెళ్లడం లేదని, కనీసం మందులు ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తాను బతికే పరిస్థితి లేదంటూ ఆవేదనతో వెల్లడించింది. మంత్రులు నారా లోకేష్, వాసంశెట్టి సుభాష్ తనపై దయతలచి తనను స్వదేశానికి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వీడియో ద్వారా వేడుకొంది.

ఇసుక, మట్టి సీజ్

తాళ్లరేవు: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 8 ట్రాక్టర్లతో సమానమైన మట్టితో పాటు ఆరు టన్నుల ఇసుకను శుక్రవారం సీజ్ చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ సూరిబాబు తెలిపారు. ఆయన కథనం మేరకు.. పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించి మట్టిని సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన మట్టి 8 ట్రాక్టర్లకు పైగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా యానాం– ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను తరలిస్తుండగా కోరంగి పోలీసులు దాడి చేసి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు స్థానిక వీఆర్వో సుబ్రహ్మణ్యం ఇసుకను సీజ్ చేశారు. కాగా సీజ్ చేసిన ఇసుకను దారి మళ్లించి, దాని స్థానంలో బొండు ఇసుకను ఉంచారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించి బాధ్యులైన ఐదుగురిపై కేసు నమోదు చేశామని సూరిబాబు తెలిపారు.

లైంగిక దాడి కేసులో 25 ఏళ్ల జైలు

కాకినాడ లీగల్: ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.11వేల జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా, రాజవొమ్మంగి మండలం యెర్రంపాడు గ్రామానికి చెందిన గునూరు వరహాలబాబు 2020 అక్టోబర్ 14 తేదీన అదే ప్రాంతంలో ఆరేళ్ల బాలిక మంచంపై నిద్రిస్తుండగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు చూడగా అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో రాజవొమ్మంగి పోలీసులకు బాలిక తల్లి తమధాల గంగాభవాని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టు విచారణలో నిందితుడు వరహాలబాబుపై నేరం రుజువు కావడంతో పోక్సో చట్టం ప్రకారం 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా, మరో సెక్షన్ ప్రకారం 6నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాలికకు రూ.7లక్షల నష్టపరిహారం అందజేయాలని తీర్పులో పేర్కొన్నారు. రెండు సెక్షన్లకు ఏకకాలంలో జైలు శిక్ష అమలు జరపాలని తీర్పులో పేర్కొన్నారు. ఏపీపీ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.